"నేను వెయ్యి జన్మలెత్తినా నీ రుణం తీర్చుకోలేను..." అన్నాడు నిరంజన్.

అవడానికి అది అతిశయోక్తి అయినా, అతనా మాటల్ని ఎంత సిన్సియర్‌గా అన్నాడంటే– ఆ సిన్సియారిటీకి నా మనసు ఆర్ద్రమైపోయింది.

నేను చేసింది ఏమంత గొప్ప సాయమని? ఆమాటే అన్నాను.

దానికతను నాకేసి నొచ్చుకోలుగా చూశాడు. ఎట్ ది సేమ్ టైం మెచ్చుకోలుగానూ చూశాడు.

"నువ్వు కాబట్టి నీ ఘనతను అలా తీసిపారేసుకోగలుగుతున్నావ్ – నీ స్థానంలో ఇంకెవరున్నా ఇంత త్యాగానికి సిద్ధపడరు తెలుసా?" అన్నాడు నా రెండు చేతులూ ఒకటిగా చేసి పుచ్చుకుంటూ.

నేను చేసింది త్యాగమా? ఆమాటే అడిగాను - ఉండబట్టలేక - బిడియంగా!



# వెయ్యినొకటో జన్మ

"కాక!?" అంటూ ఎదురు ప్రశ్న వేశాడు నిరంజన్.

"ఎంతమాత్రం కాదు..." నేను స్థిరంగా పలికాను. "ఇందులో నాస్వార్థం కూడా ఉంది" అన్నాను మళ్లీ.

"స్వార్థమా?!" నిరంజన్ ఆశ్చర్యంగా చూశాడు.

"అవును నిరంజన్." నేనతని భుజంమీద తడుతూ చిన్నగా నవ్వి, ఆ మీదట మళ్లీ కంటిన్యూ చేశాను...

"నీ భార్యకు ఆపరేషన్ చేయించడానికి నీకు ఇరవై వేలు అవసరం. ఆ ఇరవై వేలు నేన్నీకిచ్చాను... కానీ ఊరకనే ఇచ్చాననుకుంటున్నావా?"

"పోనీ అప్పుగానే అనుకున్నా... అది కూడా గొప్ప విషయమే వినోద్. అంత పెద్ద మొత్తం నేను ఈ జన్మలో తీర్చలేనని నీకూ తెలుసు. తీర్చలేని వాడికి అప్పెవరిస్తారు? నీలాంటి త్యాగధనులు తప్ప..."

ఈ మాటల్ని కూడా నిరంజన్ సిన్సియర్‌గానే అన్నాడు. అంతే తప్ప అది ముందరి కాళ్లకు బంధం వెయ్యటం కాదు.

ఎందుకంటే, అతనన్నది అక్షరాలా నిజం. ఈ జన్మంతా కష్టపడినా కూడా ఆ ఇరవై వేలు అప్పు తీర్చనే లేడు.

* * *

అయిదు వందల రూపాయల పెట్టుబడితో చిన్న కూరగాయల దుకాణంపెట్టి, రోజుకో వందో, రెండొందలో వస్తుంటే - దాన్తో సంసారాన్ని ఈదుకొస్తున్న నిరంజన్ ఇరవై వేలు బాకీ ఎప్పుడు తీర్చగలడు? తీర్చలేడని తెలిసే నేనతనికి ఆ డబ్బిచ్చాను.

నిరంజన్ వాళ్లది మా డాబా ముందుండే ఓ చిన్న తాటాకుల గుడిసె. అతను ఎనిమిదో క్లాస్‌దాకా చదివి ఆపేశాడు. ఒకటి నుంచి అయిదు దాకా మేమిద్దరం కలిసి చదువుకున్నాం. అప్పట్లో 'ఓ వెన్నూ - ఒరేయ్' - అనీ 'ఓ నిర్రూ - ఒరేయ్' అని ఒకర్నొకరం పిలుచుకునే వాళ్లం. ఇప్పటికీ ఆ చనువు అలానే వుంది.

ఒకే కులం అన్నది పక్కన పెడితే - ప్రస్తుతం మా ఇద్దరి మధ్యా ఉన్నది - హస్తిమశకాంతరం - అన్నంత తేడా!

అతను ఓ చిన్న కూరగాయల వ్యాపారి. ఇంటిముందు ఓ స్టూలు వేసుక్కూర్చుని నాలుగు తట్టల్లో కూరగాయలు అమ్ముకుంటూ ఉంటాడు. పాపం ఓ కాలు అవుకు. మొండి పనులూ, బండ పనులూ చెయ్యలేడు.

నాది ఏ లోటూలేని సంసారం. పదిలక్షల దాకా ఆస్తి వుంది. మంచి ఉద్యోగం వుంది. ఉండటానికి లంకంత ఇల్లు ఉంది. ముగ్గురు పిల్లలున్నారు. పెద్దమ్మాయి డిగ్రీ పాసయ్యింది.

పసుపులేటి సాయిలక్ష్మి

మూడేళ్ల క్రితం ఆమెకి పెళ్లి చేసేశాను. రెండో వాడు అబ్బాయి - బ్యాంక్‌లో ఉద్యోగం. నిరుడే వాడినీ ఓ ఇంటివాడ్ని చేసేశాను. కట్నం అయిదు లక్షలు. కానీ, చిన్నకొడుకు శ్రీహరి విషయంలోనే నాక్కొంత ఆందోళన ఉంది.

వాడికి మతిస్తిమితం లేదు. తింగర తింగరగా వుంటాడు. ఆ కారణంగా చదువు కూడా అబ్బలేదు. ఎప్పుడూ పిచ్చిచూపులు చూస్తూ, తనలో తనే ఏదో మాట్లాడుకుంటూ ఉంటాడు. ఒక్కోసారి అకారణంగా ఏడుస్తాడు.

వాడి వైద్యంకోసం ఎంతో ఖర్చుపెట్టాను. ఎందరెందరో సైకియాట్రిస్టలను కలిశాను. అయినా ఫలితం లేకపోయింది.

పెళ్లిచేస్తే వాడి పరిస్థితి నయమవుతుందని అంటున్నారు - నా బంధువర్గం.

కానీ చూస్తూ చూస్తూ వాడికి పిల్లనెవరిస్తారు?

* * *

"నేనేం త్యాగధనుడ్ని కాదు నిరంజన్... మా శ్రీహరి సంగతి నీకుతెలుసుగా..." అన్నాను.

"ఊఁ..." అన్నాడు నిరంజన్. అయితే...? అన్నట్టుగా చూస్తూ.

"నువ్వు నా బాకీ తీర్చడం కోసం వెయ్యి జన్మలేం ఎత్తనవసరం లేదు.. వెయ్యి జన్మలెత్తినా నా రుణం తీర్చుకోలేనన్నావుగా! కావాలంటే ఆ వెయ్యొన్నొకటో జన్మ ఇప్పుడే ఎత్తేసి - నా రుణం తీర్చేసుకోవచ్చు నువ్వు" అన్నాన్నేను - అసలు విషయం చెప్పకుండా మర్మంగా!

"ఎలా?" అన్నాడు... ఏదో అర్థమవుతూ ఉండగా.

"మీ రెండో అమ్మాయి గౌరి... ఏం లేదు నిరంజన్ - నువ్ మరోలా అనుకోవద్దు... పెళ్లి చేస్తే మా శ్రీహరి పరిస్థితి బాగుపడుతుందనుకుంటున్నాం - మేమనుకోవటం కాదు - డాక్టర్స్ కూడా అన్నారు. అందుకని మీ గౌరిని మా వాడికిస్తే..." అంటూ మధ్యలోనే ఆపేశాను.

మీరు ఎవరికైనా ఫోన్ చేసినపుడు ముఖ్యంగా మొబైల్‌కి చేసినపుడు అవతలి వ్యక్తులు ఎక్కడ ఉన్నారో కనుక్కొని, అప్పుడు మాట్లాడడం వల్ల వారికి ఏమైనా ఇబ్బంది ఉందేమో కనుక్కోవాలి. మీరు మాట్లాడవలసింది అర్జంట్ విషయం కాకపోతే వారు ఇంట్లో/ఆఫీస్‌లో లేకపోతే మళ్లీ తర్వాత చేస్తానని కట్ చేయడం మంచి అలవాటు. దీనివల్ల వారికి మీపై గౌరవం కలుగుతుంది.

నిరంజన్ చటుక్కున తలదించుకున్నాడు. ఆలోచనలో పడ్డాడు. భృకుటి ముడిపడింది. అయినా 'కుదరదు' అనడానికి అతనికి చేతా?!

నేనిచ్చిన నోట్ల కట్టలు ఇంకా అతని చేతుల్లోనే ఉన్నవాయె! కాదంటే... వెనక్కి తీసేసుకోనన్న గ్యారంటీ ఏముంది? అదీగాక అతని భార్య చావు బ్రతుకులు - గుండెలమీద కుంపటిలా ఉన్న కూతురి పెళ్లి... రెండూ అతని చేతుల్లో వున్నాయ్.

"ఊఁ" అంటే - రెండు పనులూ నిర్విఘ్నంగా జరుగుతాయ్ నిరంజన్‌కి.

"ఏమంటావ్?" అన్నాను కాసేపాగి!

"సరే..." అన్నాడు నిరంజన్ తలపైకెత్తి నా కళ్లలోకి చూస్తూ.

అతను వెయ్యి జన్మల్ని అధిగమించి వెయ్యొన్నొకటో జన్మ ఎత్తడానికి పట్టిన సమయం... సరిగ్గా పది నిమిషాలు.